# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక




## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

### హాజరుకానున్న 5.08 లక్షల మంది
### పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు.. విద్యాశాఖ వెల్లడి

హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 2 వరకూ జరిగే పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు కొనసాగుతాయి. నిర్ణీత పరీక్ష సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు ఇప్పటికే డీఈవోలకు, సీఎస్‌లకు ఆదేశాలు జారీ చేశారు.



సంపుటి: 1 | సంచిక: 342 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 18 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# వైబ్రెంట్ తెలంగాణే లక్ష్యం

నా రాజకీయం చూపిస్తా
ప్రభుత్వాన్ని పడగొడుతుంటే చూస్తూ ఊరుకుంటమా?
కుక్క కాటుకు చెప్పు దెబ్బ కొట్టకుండా ఉంటమా?
అందుకే ఓ గేట్ ఓపెన్ చేసిన..
ఎన్నికల నగారా మోగింది కాబట్టి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా పని మొదలు పెట్టిన
ఇక ఎన్నికల రూపం చూపిస్తా..
వంద రోజుల ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛను అందించామన్న సీఎం
మీట్ ది మీడియా కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం): హైదరాబాద్: 'కేసీఆర్ మొదలుకొని కడియం శ్రీహరి వంటి వారి దాకా ఈ ప్రభుత్వం మూడు నెలలు కూడా ఉండదంటూ మాట్లాడుతున్నారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఎన్నికల తర్వాత ఆపరేషన్ మొదలుపెడతామని అంటున్నారు. ఇది దేనికి సంకేతం? వందరోజుల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా ఫిరాయింపుల జోలికి వెళ్లానా? కానీ ఈ రోజు వాళ్లిద్దరూ ఒకే లైన్‌లో మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వాన్ని పడగొడతామంటున్నారు. పడగొడుతుంటే చూస్తూ ఊరుకుంటమా? కుక్క కాటుకు చెప్పుదెబ్బ అంటారు. కొట్టకుంట ఊర్కుంటమా? కొడతం కదా.. అందుకే వందో రోజు మొదలుపెట్టిన. ఓ గేట్ ఓపెన్ చేసిన. ఈరోజు ఓ ఎంపీ, ఓ ఎమ్మెల్యే వచ్చా రు. ఎన్నికల నగారా మోగింది కాబట్టి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా కూడా పని మొదలు పెట్టిన. నిన్న కోడ్ రానంత వరకు ముఖ్యమంత్రిగా చాలా నిబద్ధతతో ప్రతిరోజూ 18 గంటలు ప్రజల కోసం పనిచేసిన. చిన్న తప్పిదానికి కూడా అవకాశం ఇవ్వకుండా పనిచేసిన. నిన్న 3 గంటలకు ఎన్నికల ప్రధానాధికారి నగారా ఊదిండు. ఇక ఎన్నికల రూపం చూపిస్తా. నా రాజకీయం ఏంటో చూపిస్తా..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్య మంత్రిగా 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన 'మీట్ ది మీడియా' కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. వందరోజుల్లో అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం ..మిగతా 2లో



## బీఆర్‌ఎస్‌కు షాక్

### కాంగ్రెస్‌లో చేరిన రంజిత్ రెడ్డి, దానం నాగేందర్


హైదరాబాద్: చేవేళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ లు ఆదివారంనాడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహరాల ఇంచార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. చేవేళ్ల పార్లమెంట్ స్ధానం నుండి గత ఎన్నికల్లో రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్ధిగా విజయం సాధించారు. అయితే చేవేళ్ల పార్లమెంట్ స్ధానం నుండి తొలుత రంజిత్ రెడ్డి పేరును ఖరారు చేశారు. ఆ తర్వాత చేవేళ్ల నుండి పోటీకి రంజిత్ రెడ్డి ఆసక్తిని చూపలేదు. దరిమిలా చేవేళ్ల నుండి రంజిత్ రెడ్డి స్థానంలో కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ టిక్కెట్టు కేటాయించింది. బీఆర్ఎస్‌కు చేవేళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఆదివారం నాడు రాజీనామా చేశారు. బీఆర్ఎస్ రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవలనే దానం నాగేందర్ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డిని కలిసిన తర్వాత దానం నాగేందర్ పార్టీ మారుతారని ప్రచారం సాగుతుంది. ఈ ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. కానీ, దానం నాగేందర్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్ధం పుచ్చుకున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి దానం నాగేందర్ ను కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపే అవకాశం ఉందనే ప్రచారం సాగుతుంది.

## ఎలక్టోరల్ బాండ్ల కొత్త డేటా విడుదల



న్యూఢిల్లీ, మార్చి 17 (ప్రభాత ఉదయం): ఎలక్టోరల్ బాండ్లపై కేంద్ర ఎన్నికల సంఘం రెండో జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సమర్పించిన డేటాను మరోసారి అందుబాటులో ఉంచినట్లు ఆదివారం ఎన్నికల సంఘం వెల్లడించింది. సీల్డ్ కవరులో కోర్టుకు ఇచ్చిన వివరాలు కూడా ఇందులో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ పార్టీ అత్యధికంగా ..మిగతా 2లో

## ఎమ్మెల్సీ కవితతో కేటీఆర్, హరీష్ రావు భేటీ



న్యూఢిల్లీ, మార్చి 17 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ కస్టడీలోకి తీసుకున్న నేపథ్యంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంరెడ్డి తదితరులు ఆదివారం ఢిల్లీకి వెళ్లారు. సాయంత్రం ఈడీ కార్యాలయానికి హరీష్ రావు, కేటీఆర్, కవిత భర్త అనిల్, అడ్వకేట్ మోహిత్ రావు చేరుకున్నారు. వీరంతా కవితతో గంటపాటు భేటీ కానున్నారు. కాగా ఈడీ కస్టడీలో ఉన్న సమయంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7గంటల వరకు కుటుంబ సభ్యులను ..మిగతా 2లో



## ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పిటీషన్ సమర్పించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్

హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం)రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ తమకు అపాయింట్‌మెంట్ ఇచ్చిమరీ కలవకపోవడంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని పిటిషన్ సమర్పించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు అపాయిట్‌మెంట్ ఇవ్వడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇంటికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ వెళ్లారు. ఇంట్లో స్పీకర్ లేకపోవడంతో ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో రెండున్నర గంటల పాటు స్పీకర్ నివాసం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరీక్షించి అయినప్పటికీ ఆయన రాకపోవటంతో వెనుదిరిగారు. తమను స్పీకర్ కలవకపోవటంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్.. అపాయింట్‌మెంట్ ఇచ్చి తమను కలవకపోవడం బాధాకరమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడితోనే అసెంబ్లీ స్పీకర్ తమను కలవలేదని మండిపడ్డారు. రేపు మరోసారి స్పీకర్‌కు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని పిటిషన్ సమర్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు.








జలమండలి పూర్వపు సీజీఎం అమరేందర్ రెడి నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన సిజిఎం శ్రీధర్ రెడ్డి

## జలమండలి నూతన సీజీఎం (రెవెన్యూ)గా ఎం శ్రీధర్ రెడ్డి

సిటీ బ్యూరో, మార్చి17 (ప్రభాత ఉదయం) జలమండలి రెవెన్యూ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం)గా శ్రీధర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. డివిజన్ 12 జనరల్ మేనేజర్ గా పనిచేస్తున్న ఎం శ్రీధర్ రెడ్డి చీఫ్ జనరల్ మేనేజర్ గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ గా పనిచేస్తున్న ఎం అమరేందర్ రెడ్డి స్థానంలో ఏం శ్రీధర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. అమరేందర్ రెడ్డి నుండి శ్రీధర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సిజిఎం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ నగర ప్రజల కు సంపూర్ణ నీటి సరఫరా అందించడంతోపాటు ఆదాయ పెంపుకు కృషి చేస్తానన్నారు. సీజీఎం రెవెన్యూగా పదవి బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ రెడ్డికి డైరెక్టర్ సుదర్శన్, సిజిఎం రఘు, రాజేంద్రనగర్ జలమండలి జిఎం చంద్రశేఖర్,డీజీఎం ఉత్తమ్ సింగ్, డీజీఎం మౌనిక, మేనేజర్ సురేష్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో 15 సీట్లు హస్తగతం చేసుకుంటాం:

### ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

### బిజెపి, టిఆర్ఎస్ డ్రామాలో భాగంగానే కవిత అరెస్ట్

శంషాబాద్,మార్చి 17( ప్రభాత ఉదయం) రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 స్థానాలు కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా నర్ఖూడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగుతుందని పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఇదే తీర్పు ప్రజలు ఇవ్వనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో అన్ని స్థానాలను తామే కైవసం చేసుకుంటామన్నారు. ఎన్నికల ముందు టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడి అరెస్ట్ చేయడం బిజెపి, బిఆర్ఎస్ పార్టీ ఆడుతున్న నాటకమని అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. కొన ఊపిరితో ఉన్న టిఆర్ఎస్ పార్టీకి ఆక్సిజన్ అందించడం కోసమే కవితను అరెస్ట్ చేశారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఫయీమ్ ఖురేషి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్దేశ్వర్. జలపల్లి నరేందర్. సంజయ్ యాదవ్, ధనుంజయ, గుంటి ప్రవీణ్, మొహమ్మద్ నశీరుద్దీన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మైనార్టీ విద్యాసంస్థల మౌలిక సదుపాయాల చైర్మన్ షేక్ ఫయీం ఖురేషీ, డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్



మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్

# బిజెపి నేతలతో పార్లమెంట్ ఎన్నికలపై ప్రధాని మోడీ వాకబు

### సామాన్య నాయకులను పలకరించడం,తాజా పరిస్థితి అడగడం విశేషం: బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

షాద్ నగర్,(ప్రభాత ఉదయం):భారత ప్రధాని నరేంద్ర మోడీ భారతీయ జనతా పార్టీ సామాన్య నాయకులతో కలివిడిగా ఉ ండిపోయారని తాజా రాజకీయ పార్లమెంటు ఎన్నికల పరిస్థితులను సామాన్య కార్యకర్తల ద్వారా అడిగి తెలుసుకోవడం ఎంతో గొప్ప విషయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు.నగర్ కర్నూల్ బిజెపి సభ సందర్భంగా వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ సభ ముగిసిన తర్వాత తనతోపాటు మరికొందరు నాయకులను కలిశారని అందరిని చూడగానే నమస్కరించి తాజా రాజకీయ పరిస్థితులు ఏమిటని స్వయంగా వాకబు చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు.తమలాంటి సాధారణ నాయకులను ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకుని సూచనలు సలహాలు అడగడం వచ్చే ఎన్నికల్లో ఎలాంటి ప్రణాళికలు చేపడితే పార్టీ గెలుస్తుందో వాటిని పరిశీలించే విధంగా తమతో సమయం పంచుకోవడం జీవితంలో ఎన్నడు మర్చిపోలేని మధురానుభూతి మిగిలించిందని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.సభ అయిపోయాక దాదాపు ఆయన వెళ్లే మార్గంలో అందరిని అలా పలకరిస్తూ సాగిపోయేవారని కానీ నాగర్ కర్నూల్ సభ తర్వాత నాయకులందరిని పలకరించి వారితో తాజా రాజకీయ స్థితిగతులను తెలుసుకొని సూచన సలహాలు అందజేయడం ఎంతో గొప్ప విషయం అని,ఆ అదృష్టం తమకు దక్కిందని శ్రీ వర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.





# అర్హులైన వారికి పదవులు కేటాయిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

### పిసిసి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి

రాజేంద్రనగర్, మార్చి17(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తున్న నాయకులు, నాయకురాల్ల కు పదవులు కట్టబెట్టడం సంతోషకరమని పిసిసి మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదా లక్ష్మి అన్నారు. ఆదివారం సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సదాలక్ష్మి కలిశారు. ఈ సందర్భంగా సదా లక్ష్మి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధినేత్రి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చినప్పటి నుండి పార్టీ శ్రేణులు పార్టీ అధికారంలో లేకున్నా పార్టీ కోసం ప్రజల కోసం పనిచేస్తూ శ్రమిస్తున్నారని వారి పనితీరును గుర్తించి పదవులు కేటాయించటం ఎంతో సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు వాటికోసం పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తారని ఆమె పేర్కొన్నారు.



సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ని కలిసిన పిసిసి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదా లక్ష్మి

# ఎలక్టోరల్ బాండ్ల కొత్త డేటా విడుదల

**మొదటి పేజీ తరువాయి...**

రూ.6,986.50 కోట్ల విరాళాలను పొందినట్లు తెలిపింది. కేవలం 2019-2020 మధ్య బీజేపీకి రూ.2,555 కోట్ల బాండ్లు అందినట్లు ఈసీ విడుదల చేసిన డేటా వెల్లడిస్తోంది. ఇక.. బీజేపీ పార్టీ తర్వాత అత్యధికంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ)కి రూ.1,397కోట్ల విలువైన బాండ్లను విరాళాలుగా పొందినట్లు తెలిపింది. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల సంఘానికి ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ పూర్తి సమాచారం ఇవ్వలేదని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల నంబర్లు ఎందుకు లేవో చెప్పాలని మార్చి 15 నోటీసులు జారీ చేసింది. తమ ఆదేశాల ప్రకారం బాండ్ల పూర్తి వివరాలు వెల్లడించకపోవటంపై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌బీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

### పదో తరగతి పరీక్షలకు

# పకడ్బందీ ఏర్పాట్లు

### 9137 మంది విద్యార్థులు..37 కేంద్రాలు

### రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామ్ రెడ్డి

రాజేంద్రనగర్,మార్చి17(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.సోమవారం నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పరీక్షలకు రాజేంద్రనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా 9137 మంది విద్యార్థులు హాజరవుతారని,వీరికోసం వివిధ ప్రాంతాల్లో 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామ్ రెడ్డి తెలిపారు.రాజేంద్రనగర్ మండల పరిధిలో 4719 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.శంషాబాద్ మండలంలో 1742 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.వీరి కోసం 8 పరీక్ష కేంద్రాలను కేటాయించారు.గండిపేట్ మండలంలో 2678 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా,వీరి కోసం 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.మాస్ కాపీయింగ్ నిరోధానికి,పారదర్శక పరీక్షల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.ప్రశ్నపత్రాలు ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చినట్లు అధికారులు వివరించారు.



**37 పరీక్ష కేంద్రాలు..**

రెగ్యులర్ విద్యార్థుల కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.మొత్తం 9137 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు.ఇందులో సప్లిమెంటరీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.విద్యార్థులను గంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు.మొబైల్ ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.పరీక్ష కేంద్రాల ఆవరణలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

**ప్రత్యేక చీఫ్ సూపరింటెండెంట్లు..**

ప్రత్యేక చీఫ్ సూపరింటెండెంట్లు,డిపార్టుమెంటల్ అధికారులు,కస్టోడియన్లను నియమించారు.ప్రతీ పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు రాజేంద్రనగర్ నియోజవర్గం వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు.దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది.

**అందుబాటులో వైద్యసిబ్బంది..**

ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎం,ఆశ కార్యకర్త గ్లూకోస్ పౌడర్,ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌తో అందుబాటులో ఉంటారు.వీరు అత్యవసర వైద్య సేవలు అందిస్తారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తారు.అవసరమైనచోట షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు.

# వైబ్రెంట్ తెలంగాణే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

విలేకరుల ప్రశ్నలకు సీఎం సమాధానమిచ్చారు. నిజాం నకలునే కేసీఆర్ చూపించారు 'వారసత్వాన్ని తమపై రుద్దాలని చూసినప్పుడు తెలంగాణ సమాజం ఏకమైంది. ప్రజలు దానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. కేసీఆర్ కుటుంబాన్ని అధికారం నుంచి దించారు. ప్రజాస్వామ్యంపై ఆయనకు నమ్మకం లేదు. ఏనాడూ ప్రజల స్వేచ్ఛను గౌరవించ లేదు. నిజాం నకలునే కేసీఆర్ చూపించారు. ఖాసిం రజ్వీ ద్వారా నిజాం తన ఆధిపత్యం, అధికారంపై తిరుగుబాటు చేసిన వారిని అణిచివేసే ప్రయత్నం చేసినట్లు,ప్రభాకర్‌రావు ద్వారా కేసీఆర్ చేశారు. ప్రజల స్వేచ్ఛను హరించాలని భావించారు. అందుకే తెలంగాణ ప్రజలు కేసీఆర్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడారు. 2023 డిసెంబర్ 3న స్వేచ్ఛను తెచ్చుకున్నారు. 1948 సెప్టెంబర్ 17న ఎలాగో అలాగే స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు..' అని రేవంత్ అన్నారు. 'వంద రోజుల ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛను అందించాం. మేము పాలకులం కాదు.. సేవకులం అని తెలిపేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. 6 గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. ఉద్యమ సమయంలో వాహనాలపై రాసుకున్న 'టీజీ'ని అమల్లోకి తీసుకొచ్చాం. ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నాం. తెలంగాణ తల్లి, ప్రభుత్వ చిహ్నాల్లో రాజ దర్పాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నాం. సచివాలయంలోకి అందరికీ ప్రవేశం కల్పించాం. 2004 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు మేము ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని 26 కోట్ల మంది వినియోగించుకున్నారు. ఇప్పటివరకు 8 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించాం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో మరిన్ని వ్యాధులను చేర్చడమే కాకుండా పరిమితి రూ.10 లక్షలకు పెంచాం. 32 లక్షల కుటుంబాలు 200 యూనిట్ల వరకు ఉచిత్ విద్యుత్ పథకాన్ని అందుకున్నాయి..' అని సీఎం వివరించారు. 'కేంద్ర ప్రభుత్వంతో, తెలంగాణ గవర్నర్ తమిళిసైతో సామరస్య పూర్వకంగా ముందుకెళ్తున్నాం. వైబ్రంట్ తెలంగాణ మా లక్ష్యం. తెలంగాణ విజన్ -2050 ద్వారా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. మా ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండడం ఖాయం. ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్లు ఉంటాం. కానీ అభివృద్ధిని 2050 లక్ష్యంగా ప్లాన్ చేస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. 'వందరోజుల్లో సామాజిక న్యాయానికి మారుపేరుగా పాలన సాగించాం. నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, నలుగురు ప్రభుత్వ విప్‌లను నియమిస్తే అన్ని వర్గాలకు అవకాశం కల్పించాం. మంత్రుల్లో కూడా అన్ని వర్గాల వాళ్లు ఉన్నారు. - త్వరలోనే సమాచార హక్కు కమిషనర్లను నియమిస్తా. గతంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై మేం చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సామాజిక స్పృహ కలిగిన మంచి మిత్రుడు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవి ఆయనకే ఇద్దామనుకుంటే తిరస్కరించారు. బీఆర్ఎస్‌తో కలిసేంత తప్పు చేయరు. కలిస్తే ఆయనే సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. రైతుబంధు పథకాన్ని 5 ఎకరాల లోపు 62 లక్షల రైతులకు అందించాం. రైతుభరోసాను పకడ్బందీగా అమలు చేస్తాం. కొండలు, గుట్టలు, రోడ్లకు, కోటీశ్వరులకు, అనర్హులకు ఇవ్వం. అధికారులపై వ్యక్తిగత కక్ష సాధింపులు ఉండవు. హైదరాబాద్‌లోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి జర్నలిస్టులందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కార నిర్ణయంతో వస్తే సంతకం చేస్తా..' అని రేవంత్ చెప్పారు. టీయూడబ్ల్యుజే ప్రధానకార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం సీపీఆర్‌వో బోరెడ్డి అయోధ్యరెడ్డి పాల్గొన్నారు. '200 యూనిట్ల ఉచిత కరెంటును అమలు చేస్తుంటే కొన్ని గంజాయి మొక్కలు మళ్లీ తమ పరిమళాలను వెదజల్లే ప్రయత్నం చేస్తున్నాయి. ఉచిత కరెంటుకు సబ్సిడీని ముందు చెల్లించిన తరువాతే వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేయాలని ఈఆర్‌సీ ఆదేశించింది. ఇంటి పేరులో తన్నీరు (తన్నీరు రంగారావు) ఉన్నంత మాత్రాన ఆయన పన్నీరు కాదు. ఈ గంజాయి మొక్కను కూడా పీకుతం. ఎక్కువ రోజులు ఆ కుర్చీలో ఉండవు. విద్యుత్ సరఫరా విషయంలో కొన్నిచోట్ల కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి వందల కోట్లు కాదు, వేల కోట్లకు చేరింది. అవినీతిపై రాజ్యాంగబద్ధంగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం. బతుకమ్మను కొందరు ప్లాస్టిక్ బతుకమ్మను చేశారు. ఎవరు ఉన్నా లేకున్నా బతుకమ్మ, బోనాల పండుగలు ఘనంగా జరుగుతాయి. ప్రైవేట్ చేతిలో ఉన్న ధరణిని ప్రభుత్వ సంస్థకు అప్పగించాం. ధరణి పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే తప్ప అవినీతి జరిగిందా లేదా అనే విషయం బయటపడదు. తప్పులకు కారణమైన వారిని ఉపేక్షించం..' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డితో న్యాయవాది మోముల బసప్ప

# బిజెపిలో చేరిన షాద్ నగర్ న్యాయవాది "మోముల బసప్ప"

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో పార్టిలో చేరిన మోముల బసప్ప

షాద్ నగర్,(ప్రభాత ఉదయం):షాద్ నగర్ పట్టణ సీనియర్ న్యాయవాది మోముల బసప్ప భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరుల సమక్షంలో ఆదివారం బిజెపిలో చేరారు.బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు న్యాయవాదులు భారతీయ జనతా పార్టీలో చేరడం విశేషం. హైదరాబాద్ నగరంలోని హోటల్ కత్రియ లో జరిగిన వికసిత్ భారత్ "ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్" అనే కార్యక్రమంలో భాగంగా "అడ్వకేట్స్ మీట్" కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు న్యాయవాదులు భారతీయ జనతా పార్టీలో కలిశారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్,మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాది మూముల బసప్ప మాట్లాడుతూ...ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్ అనే నినాదంతో దేశ అభ్యున్నతి కోసం బిజెపిలో చేరినట్టు చెప్పారు.ఖచ్చితంగా మూడోసారి కూడా మోడీ సర్కార్ రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తన వంతు సహకారం భారతీయ జనతా పార్టీకి ఈ పార్లమెంటు ఎన్నికలలో ఉంటుందని అన్నారు. మోముల బసప్ప..భారతీయ జనతా పార్టీలో చేరిన షాద్ నగర్ న్యాయవాది మోముల బసప్ప మొదటి నుండి రాజకీయాలపై ఆసక్తి కనబరిచారు.బసప్ప కుటుంబ నేపథ్యాన్ని పరిశీలిస్తే నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన మోముల బసప్ప తండ్రి అంజప్ప గ్రామంలో ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నికయ్యారు.అదేవిధంగా గతంలో మోముల బసప్ప కూడా రంగాపురం ఎంపీటీసీగా గెలుపొందిన దాఖలాలు ఉన్నాయి.ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అప్పట్లో బసప్ప చేతిలో ఎంపీటీసీగా ఓటమిపాలయ్యారు.ఆ తర్వాత రాజకీయాల్లో బసప్ప చురుగుగా లేకపోయినప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాల్లో మాత్రం తనదైన ముద్ర వేసుకున్నారు.ఎన్నో సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహించారు.ఎక్కువగా పబ్లిసిటీకి ఇష్టపడనీ బసప్ప అనేక గ్రామాల్లో ఎక్కువ గుప్తదానాలు కూడా చేశారు. బసప్ప ఉన్నఫలంగా భారతీయ జనతా పార్టీలో చేరడం పట్ల అందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో చనువుగా కనిపించిన బసప్ప ఇప్పుడు భారతీయ జనతా పార్టీలోకి వెళ్లడం గమనార్హం.బసప్ప బిజెపిలో రావడం పట్ల బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ అందే బాబయ్య హర్షం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర డైరీ అభివృద్ధి సంస్థ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కోరని దయానంద్

రాజేంద్రనగర్,మార్చి17(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర డైరీ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమితులైన గండిపేట్ మండలానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోరని దయానంద్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచం అందజేశారు.ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ...రాష్ట్రంలో డెయిరీ రంగం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గం రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలలో అందరం కలిసికట్టుగా పనిచేసి చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేద్దామన్నారు.



# డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అన్నపురెడ్డి మాధవరెడ్డి

గండిపేట, మార్చి17(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ చెందిన బి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియమితులు కావడం హర్షించదగ్గ విషయం అని రంగారెడ్డి జిల్లా రైతు సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు హైదర్ షాకోట్ రైతు సహకార సంఘం డైరెక్టర్ అన్నపురెడ్డి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలోకి దూసుకు వెళ్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కు రాష్ట్ర పౌల్ట్రీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించి సముచితస్థానం కల్పించడం అభినందనీయమన్నారు . జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో డైరీ డెవలప్మెంట్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమితులైన జ్ఞానేశ్వర్ కు అన్నపురెడ్డి మాధవరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు .



డైరీ డెవలప్మెంట్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్



అన్నపురెడ్డి మాధవరెడ్డి

# ఎమ్మెల్సీ కవితతో కేటీఆర్, హరీష్ రావు భేటీ

**మొదటి పేజీ తరువాయి...**

కలిసేందుకు కోర్టు అనుమతిచ్చింది. కవితతో భేటీ అనంతరం న్యాయవాదులు, నిపుణులతో కూడా మాట్లాడుతారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వస్తారని తెలుస్తోంది. న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలన్నదానిపైనే వీరు ప్రధానంగా దృష్టిసారించనున్నారు. ఇక కాగా ఢిల్లీ మద్యం పాలసీ మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను శుక్రవారం సాయంత్రం ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఆమెను హాజరుపరిచారు. ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్ పాల్ ఎదుట హాజరు పరిచారు. కవిత తరపు న్యాయవాదులు, ఈడీ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ఈనెల 23వరకు కోర్టు ఈడీ కస్టడీ విధించింది. ఆరోజు మధ్యాహ్నం తిరిగి కవితను కోర్టులో హాజరుపర్చాలని అధికారులను కోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పుతో కవితను కస్టడీలోకి తీసుకున్న ఈడీ అధికారులు.. తమ కేంద్ర కార్యాలయంలోని ప్రత్యేక సెల్‌లో ఆమెను ఉంచారు. నేటి నుంచి సీసీటీవీల పర్యవేక్షణలో కవితను ఈడీ అధికారులు విచారిస్తున్నారు.

# చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగురవేస్తాం



పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న చేవెళ్ల ఎంపీ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హిందీ సమాజ్ ప్రతినిధులు

## చేవెళ్ల బిజెపి ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

### పార్టీని బూత్ స్థాయిలో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలి..

రాజేంద్రనగర్, మార్చి17 (ప్రభాత ఉదయం) పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి సామ భూపాల్ రెడ్డి గార్డెన్ లో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం బిజెపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి హాజరై ప్రసంగించారు.కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బిజెపి బలంగా ఉందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదన్నారు.గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక హామీలు,గ్యారెంటీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు బీజేపీ పార్టీలో ప్రతి కార్యకర్తకు ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కలుగుతుందన్నారు.అదేవిధంగా చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ప్రతి కార్యకర్త విస్తృతంగా తీసుకుపోవాలని పేర్కొన్నారు.పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు.కేంద్రం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నప్పటికీ, రాష్ట్రంలో వాటిని అమలు చేయక పోవడం దారుణమన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,డాక్టర్ ప్రేమ్ రాజ్, బిజెపి రాష్ట్ర నాయకులు టి అంజన్ కుమార్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, బుక్కా వేణుగోపాల్, కొమురయ్య, రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి, నందకిషోర్, రాజేంద్రనగర్, మైలార్దేవపల్లి డివిజన్ల బిజెపి అధ్యక్షులు బాబురావు,ఆడికే జనార్ధన్, పార్టీ నాయకులు బిక్షపతి యాదవ్,విజయ్ కుమార్, సుధాకర్,సత్యనారాయణ ముదిరాజ్, కిరణ్ చారి,బీరప్ప,మూల శ్రీనివాస్,చంద్రయ్య,మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



బస్ క్రిందకు దూసుకు వెళ్లిన కారు

# ఏ ఆర్ ఐ గేటు వద్ద బస్ క్రిందకు దూసుకు పోయిన కారు

బుద్వేల్, మార్చి17(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంఏ ఆర్ ఐ) గేటు ముందు బస్సు మలుపుతుండగా వెనకాల నుంచి వేగంగా వచ్చిన కారు బస్సు వెనుక భాగంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది . అయితే కారులో ఉండే వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

# యేసయ్య మార్గంలో నిక్కచ్చిగా జీవించాలి



రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్-సిస్టర్ సీహెచ్ ప్రభావతిలను సన్మానిస్తున్న విక్టర్ గ్లాడీ ప్రేమ్సన్, డానీ, సిస్టర్ కృపా కుమారీలు



బైబిల్ సందేశాలను వివరిస్తున్న సిస్టర్ కృపా కుమారీ



సిస్టర్ కృపా కుమారీని సన్మానిస్తున్న విక్టర్ గ్లాడీ ప్రేమ్ సన్, డానీలు

బుద్వేల్, మార్చి 17(ప్రభాత ఉదయం): యేసయ్య మార్గంలో నడుచుకుంటున్న విశ్వాసులు నిక్కచ్చిగా జీవించాలని అమలాపురం పాలగుమ్మి మన్నా చర్చ్ కు చెందిన సిస్టర్ సిహెచ్ కృపా కుమారి అన్నారు. మన్నా మినిస్ట్రీస్ లో మూడు సంవత్సరాల బైబిల్ ట్రైనింగ్ కోర్స్ పూర్తి చేసి శనివారం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ తీసుకున్న సిస్టర్ కృపా కుమారి ఆదివారం రాజేంద్రనగర్ మన్నా చర్చ్ లో జరిగిన ఆరాధనలో బైబిల్ సందేశాలను అందజేశారు. దేవుని లో నమ్మ దగిన వారముగా ఉండాలన్నారు, సత్క్రియలు చేసే వారిగా క్రైస్తవులు జీవించాలన్నారు. యేసు ప్రభువు కోసం పనిచేసే వారిగా ఉ ండాలన్నారు. పైకి చర్చికి వెళుతూ, లోపల దేవునికి అయిష్టమైన పనులు చేయకూడదన్నారు.

### టీచర్ ను కావాలనుకున్నా..

బాగా చదువుకుని టీచర్ ను కావాలనుకున్నానని, దేవుడు మాత్రం పాస్టర్ ను చేశారని గుర్తు చేసుకున్నారు. మా తండ్రి రెవరెండ్ జాన్ లాజరస్ దేవుని లో నిద్రించాక అమ్మ సిస్టర్ కృపా రత్నం కు సహాయంగా దేవుని సేవ చేయడం ప్రారమబించానన్నారు. పాస్టర్ జాన్ వెస్లీ ని వివాహం చేసుకుని పాలగుమ్మి మన్నా చర్చ్ లో సేవ చేయడానికి దేవుడు కృప చూపారన్నారు. దేవుడు తనకు జాన్ లాజరస్(హోలీ), జెమిమా లను సంతానం గా ఇచ్చారని వారు కూడా దేవుని సేవ లో సకారులుగా ఉన్నారన్నారు. అన్నయ్య జాన్ మోజెస్ మాకు అన్ని విధాలుగా సహకారం అందిస్తూ వస్తున్నారన్నారు. వదిన సిస్టర్ సీహెచ్ ప్రభావతి ఎంతో ప్రేమగా చూసుకుంటారన్నారు. మన్నా బైబిల్ కాలేజ్ నుంచి మూడు సంవత్సరాల ఆధ్యాత్మిక కోర్సు పూర్తి చేయడానికి దేవుడు అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేవుని సేవలో ఉన్న తమను ఆయన ఎంత గానో ఆశీర్వదించాడన్నారు. మన్నా చర్చ్ తరపున పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ శాంతి , బ్రదర్ ఎ. దానియేలు లు శుభాకాంక్షలు తెలియ చేశారు.

### పాస్టర్ కుటుంబాన్ని సన్మానించిన గ్లాడీ ప్రేమ్సన్, డానీ లు :

రాజేంద్రనగర్ లో దేవుని సేవ చేస్తున్న రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతి లను విజయనగరం కు చెందిన విక్టర్ గ్లాడీ ప్రేమ్ సన్, డానీ లు సన్మానించారు. బైబిల్ కోర్సు పూర్తి చేసి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ తీసుకున్న సిస్టర్ కృపా కుమారీ ని శాలువా, పుష్ప గుచ్ఛం తో సన్మానించి శుభాకాంక్షలు తెలియ చేశారు.



పల్లె చెరువు కట్ట మైసమ్మకు నమస్కరిస్తున్న మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

# పల్లె చెరువులో సామూహిక బోనాల జాతర

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలర్దేవ్పల్లి డివిజన్ పల్లె చెరువులో ఆదివారం గంగపుత్ర సంఘం, మత్స్యశాఖ పరిశ్రమ సహకార సంఘం అధ్వర్యలో సామూహిక బోనాలజాతర నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్, రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈకార్యక్రమంలో అద్యక్షులు గంట శంకర్, ఉపాధ్యక్షులు జి. సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి నస శ్రీనివాస్, యూత్ అద్యక్షులు పాండు యాదవ్, శంకర్ రెడ్డి సంఘం సభ్యులూ తదితరులు పాల్గొన్నారు.



తోకల శ్రీనివాస్ రెడ్డి ని సన్మానిస్తున్న గంగ పుత్రులు



# దేవునిలో నిద్రించిన గోల్కొండ చౌరస్తా ఎం బీ బేతేల్ చర్చ్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ గోనె జోనహా సంజీవరావు

బుద్వేల్, మార్చి17(ప్రభాత ఉదయం): గోల్కొండ చౌరస్తాలోని ఎం బి బేతల్ చర్చ్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ గోనె జోనహ సంజీవరావు ఆదివారం సాయంత్రం దేవునిలో నిద్రించారు. ఆయనను సంఘ సభ్యులు, బంధువులు, స్నేహితులు చూడటానికి సోమవారం ఉదయం 11 గంటలకు గోల్కొండ చౌరస్తాలోని ఎంబి బేతేలు చర్చిలో ఉంచుతారు. సమాధి కార్యక్రమాలు మధ్యాన్నం 2 గంటలకు బోయిగూడ క్రైస్తవ సమాధుల తోటలో నిర్వహించడం జరుగుతుందని ఆయన కుమారుడు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ క్రిస్టియన్ లీడర్స్, పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోనె సోలోమాన్ రాజు తెలిపారు.





నాగర్ కర్నూల్ లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి కార్యకర్తలను నాయకులను సందర్భంలో ప్రధాని మోడీకి నమస్కరిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి
రాజేంద్రనగర్, (ప్రభావత ఉదయం)

# ఆస్తిపన్ను సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం

## డిప్యూటీ కమిషనర్ రవికుమార్

### సమస్యలు ఉంటే పరిష్కార వేదికల ద్వారా పరిష్కారం
### ఈ పరిష్కార వేదికలో 9 మంది ఫిర్యాదులు స్వీకరణ

రాజేంద్రనగర్,మార్చి17(ప్రభాత ఉదయం) ఇంటి యజమానులు ఆస్తి పన్ను సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే పరిష్కరిస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ సూచించారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆస్తిపన్ను వసూలు కోసం ప్రత్యేక కార్యచరణ చేపట్టామని వివరించారు.ఈ పరిష్కార వేదికలో 9 మంది ఫిర్యాదులు చేశారు.ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ప్రతి ఆదివారం ఆస్తిపన్ను పరిష్కార సమావేశాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ఆస్తిపన్నులో అసమానతలు,ఇతర సమస్యల పరిష్కారాలకు గాను ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.ఆస్తిపన్ను చెల్లింపులో ఏవైనా సమస్యలు ఉన్నా,నివాసం ఖాళీగా ఉన్న వారు ఈ సమావేశాల్లో పరిష్కరించుకునేందుకు ఆస్కారం ఉంది.ఆస్తి పన్ను వసూలుకు మార్చి 31వ తేదీ గడువు తేదీ కావడంతో ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తూ టార్గెట్ పూర్తి చేస్తున్నామని డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తెలిపారు.ఫిర్యాదులను స్వీకరించి క్షేత్ర స్థాయిలో సందర్శించి నిజ నిర్ధారణ చేసుకున్న తరువాత పరిష్కారం చూపుతామని వెల్లడించారు.




ఇంటి యజమానుల నుండి వినతి పత్రాలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

### ప్రతి ఫిర్యాదును స్వీకరిస్తాం..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తి పన్నుదారులందరూ తమ ఆస్తిపన్ను చెల్లింపులో సమస్యలు ఉంటే ఈ పరిష్కార వేదికల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆస్కారం ఉంటుంది.మార్చి 31 వరకు ప్రతి ఆదివారం నిర్వహించే ఆస్తిపన్ను పరిష్కార సమావేశంలో భవన యజమానులు తమ ఆస్తిపన్ను చెల్లింపులో ఉన్న సమస్యల గురించి అధికారులకు ఫిర్యాదు చేస్తే సంబంధిత ఆస్తులను పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపుతారు.




# పక్క చూపులు చూస్తున్న ఇతర పార్టీ నేతలు

**సరైన సమయం కోసం వేచి చూస్తున్న జంప్ జిలానీలు**
**నేడో రేపో పార్టీ కండువాలు మార్చనున్న తాజా,మాజీ కౌన్సిలర్లు**
**స్వప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్న జంపింగ్ జంపాగ్‌లు**
**ప్రతిపక్ష నాయకులకు దడ పుట్టిస్తున్న అధికార పక్షం నేతలు**
**ఎమ్మెల్సీ ఎన్నికలల్లో క్లీన్ స్విప్ చేయాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకులు**
**రాబోయే రోజుల్లో షాద్ నగర్ నియోజకవర్గంలో సరికొత్త రాజకీయం**



షాద్ నగర్,(ప్రభాత ఉదయం):మొన్నటి వరకు అధికార పార్టీలో ఉండి చక్రం తిప్పిన నాయకులు అధికారం కోల్పోయేసరికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఎప్పుడూ..అధికారంలో ఉండాలనే ఆకాంక్షనో లేదంటే ప్రతిపక్షంలో ఉంటే వారి ఆస్తులకు రక్షణ ఉండదనే భయమో..నాయకుల స్వప్రయోజనాల కోసం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి జంపు కావడం నేటి రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిపోయింది.ఈ కోవలోనే నేడో రేపో షాద్ నగర్ పట్టణానికి చెందిన తాజా మాజీ కౌన్సిలర్లు పార్టీ మారే యోచనలో ఉన్నట్లు తెలిసింది ఇప్పుడు ఇదే వార్త ఆ నోట ఈ నోట గుసగుసలు వినిపిస్తున్నాయి.అధికారపక్షం కూడా బలమైన ఇతర పార్టీ నాయకులను ఆకర్షించడం కోసం వారికి తాయిలాలతోపాటు భవిష్యత్తు భరోసా ఇచ్చి మరి పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిసింది రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈసారి కచ్చితంగా ఎమ్మెల్సీ ని గెలిపించు కోవాలనే దృఢ సంకల్పంతో అధికార పార్టీ పని చేస్తున్నట్లు కనబడుతుంది.గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఈసారి వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎంతమంది నాయకులను ఇతర పార్టీలోకి వెళ్లకుండా ఆపగలుగుతుందో చూడాలి.ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లను నట్టేట ముంచుతున్న నాయకులు..ఎమ్మెల్సీ,ఎంపీ,ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది అన్ని పార్టీల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసు కుంటున్నాయి.ఉదయం ఒక పార్టీ కండువా కప్పుకున్న నేతలు సాయంత్రం కల్లా ఆపార్టీలో ఉంటాడనే నమ్మకం లేకుండా పోయింది.దీంతో అన్ని పార్టీలకు వీరి తీరుతో తీవ్ర తలనొప్పిగా మారింది.పార్టీలను నమ్ముకుని ఉండి చివరకు ఆశించిన చోట్ల టిక్కెట్లు రాకపోవటంతో వేరే పార్టీలకు మారుతున్నారు.దీంతో అప్పటి వరకు వారితో ఉన్న కార్యకర్తలు అయోమయంలోకి పడిపోతున్నారు.మొన్నటి వరకు వేరేపార్టీలకు వ్యతిరేకంగా పనిచేస్తూ ఆ పార్టీ నేతే పార్టీ మారిన తరుణంలో ఆయనతోపాటు వెళ్లి పనిచేయాలా లేకపోతే పార్టీని నమ్ముకుని అదే పార్టీలో ఉండాలనేది అర్థం కావటం లేదు.ఇది చిన్నచిన్న నాయకులే కాదు పెద్ద నాయకులు సైతం ఇదే విధంగా మారుతున్నారు.మరి వీరికి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల పరిస్థితి ఏమిటి ఒక పార్టీని లేదా ఒక నాయకున్ని నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను మాత్రం ఈ నాయకులు నట్టేట ముంచుతున్నారు.స్వప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్న ఈ జంపింగ్ జపాంగ్ లను చూసి ఊసరవెల్లులే అవాక్కవుతున్నాయి.మున్సిపల్ కు చెందిన ఒక ప్రముఖ నాయకుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అండర్ గ్రౌండ్ లోకి వెళ్లినట్లు తెలిసింది ఆయన కోసం ఆ పార్టీ నాయకులు బుజ్జగింపులు చేసే ప్రయత్నం చేస్తున్నారని కానీ అయన అందుబాటుకి రావడం లేదని తెలియవచ్చింది.



# రాతిరేల సంధు చూసి జంపు జిలానీ..!

షాద్ నగర్,(ప్రభాత ఉదయం):పార్టీలో పదవి రాకపోయినా,వచ్చిన పదవి నచ్చకపోయినా,పార్టీ అధినాయకత్వం తీరు బాగోలేకపోయినా,పార్టీలో అంతర్గత వర్గపోరు తారాస్థాయికి చేరినా,మెజారిటీ సమస్య ఉత్పన్నమైనా వేసుకున్న చొక్కా మార్చినంత సులువుగా పార్టీ కండువాలు మార్చుకోవడం ఈరోజుల్లో ఆనవాయితీగా కాదు ఫ్యాషన్ గా మారింది.అసలు ఈ జంప్ జిలానీలను కనుగొన్నదేవరు చెప్మా...? జంప్ జిలానీలు అంటే ప్రజల చేత ఎన్నుకోబడిన,ఎన్నుకొక పోయినా ప్రజాసేవ చేసే నాయకులు తమ ఇష్టారాజ్యంగా పూటకో కండువా మార్చడం,ప్రభుత్వాలు మారితే కూడా పార్టీలు మారడం ఆనవాయితీగా మారుతుంది.ఏ రాజకీయ పార్టీలకైనా జంప్ జిలానీలు వుంటారు.వాళ్లతో సమస్యలు వుంటాయి.నక్క ఒక చోట గౌరీ కళ్యాణమా' అని వెనకటికి సామెత.ఈ పార్టీలో గొడవ పడిన వాడు,ఈ పార్టీలో రచ్చకెక్కినవాడు,ఈ పార్టీ నుంచి గోడదూకిన వాడు,ఇంకో పార్టీలో మాత్రం బుద్దిగా వుంటాడని ఏమిటి? గ్యారంటీ? 'వెనకటి గుణమేల మాను' అని పెద్దలు అననే అన్నారు.కానీ రాజకీయాల్లో సమస్య ఏమిటంటే, ఇవన్నీ తెలిసినా, జంప్ జిలానీలను తీసుకోకతప్పదు..అవును అది వాళ్ళ వీక్ నేస్ అబ్బా..! ఇక అసలు విషయానికి వచ్చేద్దామా..? అసలు పార్టీలు మార్చడం అంటే అగ్నిసాక్షిగా కట్టుకున్న వారిని మార్చడమే అని ఈనాడు సినిమాలో సూపర్ స్టార్ చెప్పిన డైలాగ్ ఇంకా చెవుల్లో మారు మోగుతూనే ఉంటుంది.నిన్ను చూసి నీ సామర్థ్యాన్ని చూసి నీ వాగ్దానాలను చూసి ప్రజలు నిన్ను ఆదరించలేదు..నీ పార్టీ చూసి ఆ పార్టీ వెనుక ఉన్న నాయకులను చూసి ఆ పార్టీ సిద్ధాంతాలను చూసి నిన్ను గెలిపించారు.పార్టీ మారడం అంటే అగ్నిసాక్షిగా తాళి కట్టిన ఇల్లాలిని వదిలేసి వ్యభిచారం చేయడంతో సమానం అంటూ ఆ రచయిత రాసిన అక్షరాలు అచ్చంగా ఇప్పుడు గంపగుత్తగా పార్టీలు మారుతున్న వారికి నిరసనగా చెప్పవచ్చని అంటున్నారు.పార్టీ మారే హక్కు పౌరుడిగా ఉండవచ్చు కానీ పార్టీల బిఫామ్ తో గెలిచి ఆ తర్వాత మరోచోట ప్రయోజనం లాభం ఉందని ఆ పార్టీని కాళ్లతో తన్ని వెళ్ళిపోయే వారికి మాత్రం అది భావ్యం కాదని చెప్పాలి.పార్టీ ఫిరాయింపులకు ఎవరు ఊతం ఇచ్చినా అది సమాజ శ్రేయస్కరం కాదు.ఒకవేళ పార్టీ మారాలనుకుంటే వెంటనే ఏ పార్టీపై గెలిచారో ఆ పార్టీకి రాజీనామా ఇచ్చి ప్రజలకు క్షమాపణ చెప్పి మరో పార్టీలో చేరితే ఆ నాయకులను ప్రజలు ఆదరిస్తారు లేదా చీకొడతారు..సందిట్లో సడే మియాగా మనలను ఎవరు ఏమంటారు? సంఘంలో తాము ఓ గొప్ప నాయకులమని విర్ర విగేవారికి మాత్రం ప్రజలు భవిష్యత్తులో బుద్ధి చెబుతారు సుమీ..

# ఈము రైతుల రుణాలను సెటిల్ చేయండి

## ఈము రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటేశ్వర రెడ్డి

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ఈము రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటేశ్వర రెడ్డి**
**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం**



ఈము పక్షుల రైతులు ఇచ్చిన వినతిని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,(ప్రభాత ఉదయం):రాష్ట్రంలో ఈము పక్షుల రైతులు తీవ్రంగా నష్టపోయారని...వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈము రైతు సంఘం తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకటేశ్వర రెడ్డి తదితర రైతులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లను కలిశారు.ఆదివారం హైదరాబాద్ లో ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రిని విడివిడిగా కలిశారు.బ్యాంకు రుణాలు చెల్లించలేని స్థితిలో రైతులు ఉన్నారని ఆయనకు వివరించారు.బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను రద్దు చేయాలని మంత్రికి విన్నవించారు.ఇతర రాష్ట్రాల్లో ఈము రైతులకు రుణమాఫీ పథకం అమలు చేశారని గుర్తు చేశారు.నాబార్డు పథకంలో రుణాలు పొంది నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు మంత్రిని కోరారు.అసలు రైతులకు ఈము పక్షుల గురించి ఏ విషయం తెలియదని నాబార్డు రైతులను మభ్యపెట్టి రాజేంద్రనగర్ లో శిక్షణ ఏర్పాటు చేసి కోళ్ల పెంపకంపై ప్రోత్సహించారని తెలిపారు.రైతుల విషయంలో ప్రభుత్వం ప్రతిపాదనలు అమలు చేయాలని హైకోర్టు సూచించిందని అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి అన్నారు.ఈనెల 14న రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈము రైతులకు భరోసా ఇచ్చారని ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.గత 15 సంవత్సరాల నుండి పరిష్కారానికి లోచని తమ సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వమైన చొరవ చూపి ఈమూ రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.గత రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతులకు న్యాయం చేస్తామని కమిటీ వేసి కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని మరి ఎందరో రైతులు వారి ఆస్తులను బ్యాంకుల్లో సీజ్ చేయడం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మూడు రైతులకు సమస్యను పరిష్కారం చేశారని బ్యాంకర్స్ తో మాట్లాడి సెటిల్ చేశారని కానీ తెలంగాణలో మాత్రం గత 10 సంవత్సరాలుగా రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులకు ఆయా ప్రభుత్వాలు చేసిన విధంగానే తెలంగాణలో కూడా సమస్యకు పరిష్కార మార్గం చూపాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని వెంకటేశ్వర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కోర్టు దిక్కున కింద కూడా గత ప్రభుత్వంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి స్పష్టం చేశారు.అయినప్పటికీ సమస్త కు పరిష్కారం లభించలేదని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ఈ ప్రభుత్వమే నా తమ గోడు పట్టించుకుని రైతులకు పూర్తి న్యాయం చేయాలని తమ సమస్యను సెటిల్ చేయాలని కోరారు.



వైద్య సేవల కోసం ఎల్ఓసి అందజేస్తున్న శేరి లింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్

# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఓ వరం

## శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్


కూకట్‌పల్లి,మార్చి17 (ప్రభాత ఉదయం) నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఓ వరమని శేరి లింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ మరియమ్మ నగర్ నివాసముండే ఎస్.నర్సింహ చారి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,50,000/- రెండు లక్ష యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్(ఎల్ ఓ సి) మంజూరి పత్రాలను డివిజన్ అధ్యక్షులు మరేళ్ల శ్రీనివాస్, బాష్పక యాదగిరి ఇతర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధితుడికి అందిచారు.

# పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

## జిల్లా ఎస్పీ రీతిరాజ్



గద్వాల,మార్చి17(ప్రభాత ఉదయం) రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 10 వ తరగతి పరీక్షలు జరుగనున్న దృష్ట్యా జిల్లా లో 10 వ తరగతి పరీక్షలు జారిగే 41 పరీక్ష కేంద్రాల దగ్గర పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేయడం తో పాటు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. 41 పరీక్షా కేంద్రాలలో 7378 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నరని , ఈ సందర్భంగా పరీక్షలు జరిగే రోజున భద్రతా చర్యల నిమిత్తము కొన్ని ముఖ్యమైన సూచనలు తప్పనిసరిగా అమలు చేయబడునని , పరీక్షలు జరుగు కేంద్రాల చుట్టు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు.10వ తరగతి పరీక్షలు ఈ సంవత్సరం 7 పేపర్లు గా ఎస్ ఎస్ సి బోర్డ్ కుదించడం జరిగిందనీ ఈ విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో పరీక్షలు వ్రాయాలని ఎవరూ వత్తిడికి గురి కావద్దని సూచించారు.పరీక్షల దృష్ట్యా ప్రజలు మరియు విద్యార్థులు పోలీస్ వారి సూచనలూ పాటించి సహకరించాలని ఎస్పీ రితిరాజ్ సూచించారు.పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ విధించబడును, ఇద్దరూ అంతకంటే ఎక్కువ మంది గుమి కూడ రాదన్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర అన్ని జిరాక్స్ సెంటర్స్, మూసి వేయబడును.విద్యార్థులు మాత్రమే పరీక్ష కేంద్ర%శీ%/ హాలు లోకి ప్రవేశము కలదు. గేటు మూసివేసిన తర్వాత లోపలికి అనుమతించరన్నారు. విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్ , ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ కూడా పరీక్షా కేంద్రములోనికి మొబైల్ ఫోన్స్ స్మార్ట్ వాచెస్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రంలో ఏమైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు డయల్- 100 గాని లేక సంబంధిత పోలీసులకు గాని ఫిర్యాదు చేయాలని సూచించారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న బండి రమేష్

# సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

## కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్...

కూకట్‌పల్లి,మార్చి17 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే వారు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రజా పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలాజినగర్ లో నివాసముంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాదు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్ సమక్షంలో బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు . ఈ సందర్బంగా బండి రమేష్ మాట్లాడుతూ బాలాజినగర్ వాసులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రజపాలనకు ఆకార్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్బంగా వారికీ స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ అన్నారు. ఉమా, ప్రమీల, గీతా, దివ్య, శ్వేత, పావని, ధనలక్ష్మి, అనిత, సునీత, సుధా, రాజశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అర్జున్ రెడ్డి, వినయ్, విక్కీ తదితరులు., ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, పుష్ప రెడ్డి, సేరి సతీష్ రెడ్డి, లక్ష్మయ్య, రేష్మ, నాగమణి, శివ చౌదరి లు పార్టీలో చేరారు.

**అల్లాపూర్ లో..**

అల్లాపూర్ డివిజన్ పరిధిలో గల సర్దార్ నగర్ లోని వందమంది మైనారిటీ నాయకులు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్బంగా బండి రమేష్ మాట్లాడుతూ సర్దార్ నగర్ లోని మైనారిటీ నాయకులకు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ తరుపున స్వాగతం పలుకుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, విటల్ రెడ్డి, సీనియర్ నాయకులు సేరి సతీష్ రెడ్డి, బి బ్లాక్, అధ్యక్షురాలు రేష్మ, బర్కత్ అలీ, జమీర్ భాయ్, ఇస్మాయిల్, అబ్దుల్లా, నజీర్, వహీద్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ విజయ కనకదుర్గ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు

## అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు.



భక్తులకు భోజనం వడ్డిస్తున్న కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి,మార్చి17 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజక వర్గం లోని కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు 6ఫేజ్ లోని శ్రీ శ్రీ శ్రీ విజయ కనక దుర్గ దేవాలయం వార్షకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బండి రమేష్, గొట్టుముక్కల వెంకటేశ్వర రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యం

## వి జగదీశ్వర్ గౌడ్, బండి రమేష్ కమ్మ కార్పొరేషన్ కు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం



కూకట్‌పల్లి,మార్చి17 (ప్రభాత ఉదయం) కమ్మ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుక బడిన పేద మధ్యతరగతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఆదివారం మియపూర్ డివిజన్ అల్విన్ కాలనీ చౌరస్తా లో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు మనెపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, నియోజకవర్గ నాయకులు,ప్రజలతో కలిసి తెలుగు ప్రజల ఆరాధ్యదైవం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కేబినెట్ మంత్రివర్గ సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డల కోసం 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఈరోజు కమ్మ కార్పొరేషన్ కు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం అని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వి.వీరేందర్ గౌడ్, నాయకులు ఇలియస్ షరీఫ్,నాగేశ్వరరావు, కావూరి ప్రసాద్, కొఠారి వెంకటేష్, సత్యనారాయణ, డివి ప్రసాద్, రాజేష్,ఆంజనేయులు యాదవ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, సాయి, శ్రీకాంత్, రాంబాబు, వీరంజనేయులు, సాంబశివరావు, పోలిన సుబ్బా రావు చౌదరి, సుంకావల్లి భగవాన్, శ్రీకాంత్, పట్వారీ శశికాంత్, మాజర్, బ్రమయ్య, శ్రీనివాసరావు, రవి, అమర్, కె.ఎల్ నారాయణ, వేమూరి సాంబశివరావు, రవి కుమార్, నాయుడు, శ్రీను, వెంకట్ రెడ్డి, లోకేశ్వ రావు, వెంకట్ రెడ్డి, అశోక్,నరేష్, మహిళలు పార్వతి, శాంతా తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.